క్లుప్తంగా

తీగ తొలగించారు



సాక్షి స్పందన

మంచిర్యాలఅగ్రికల్చర్: ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన పచ్చికబయళ్ల గడ్డితీగలు తినేందుకు మూగజీవాలు వెంపర్లాడుతున్నాయని 'తీగ చుట్టూ అల్లుకున్న ప్రమాదం' అనే శీర్షికన 'సాక్షి' ఈ నెల 6న ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. జిల్లా కేంద్రంలోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న గడ్డితీగలను మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు ఆయా ప్రాంతాల్లో తొలగించి, మూగజీవాలను ప్రమాదాల భారిన పడకుండా చర్యలు తీసుకున్నారు.

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా

- డీసీపీ ఎగ్గడి భాస్కర్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు, చట్టవ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని డీసీపీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని హమాలివాడలో బుధవారం నిర్బంధ తనిఖీలు, పట్టణంలోని ప్రధాన చౌరస్తాల వద్ద ప్రత్యేక బలగాలతో నాకాబంధీ నిర్వహించారు. గంజాయి, పాత నేరస్తుల ఇళ్లలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నేరాలు అరికట్టేందుకే నిర్బంధ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, సీఐలు ప్రమోద్‌రావు, అశోక్, నరేష్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోచమ్మ.. దీవించమ్మా



బోనమెత్తిన నిషాక్రాంతి, సురేఖ

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ(సినిమావాడ) కట్ట పోచమ్మ బోనాల జాతర బుధవారం అంగరంగవైభవంగా సాగింది. హమాలీవాడ భక్తాంజనేయ సాయిబాబా ఆలయం నుంచి హమాలీవాడ కట్ట పోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు సాగింది. హైదరాబాద్ నుంచి వచ్చిన జోగిని నిషాక్రాంతి పూనకాలతో నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పోతరాజుల విన్యాసాలు అలరించాయి. బంగారు బోనంను జోగిని నిషాక్రాంతి అమ్మవారికి సమర్పించారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మాజీ వైస్ చైర్మన్ నల్ల శంకర్‌తో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా మదేలమ్మ బోనాల జాతర

చెన్నూర్: పట్టణంలో మదేలమ్మ బోనాల జాతరను రజక కులస్తులు ఘనంగా నిర్వహించారు. బోనాలతో నృత్యం చేస్తూ శోభాయాత్రగా ఆలయానికి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రజక కుల సంఘం నాయకులు కొండపర్తి వెంకటరాజం, అయిలాల రమేశ్ పాల్గొన్నారు.

కొమ్మెరలో ఊరి కొలుపు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెరలో బుధవారం ఊరి కొలుపు కార్యక్రమం నిర్వహించారు. అందరూ సుఖఃసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు. గ్రామంలోకి వేరే వారు రాకుండా, రాకపోకలు కొనసాగించకుండా పొలిమేరల్లో బంధనం చేశారు.

బిర్యానీలో జెర్రి



నస్పూర్: పట్టణ పరిధిలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలోని ఓ హోటల్లో బుధవారం బిర్యానీలో జెర్రి రావడంతో వినియోగదారుడు అవాక్కయ్యాడు. ఈ విషయమై హోటల్ నిర్వాహకులను ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లోపంతో తరుచుగా హోటళ్లలో పునరావృతం అవుతున్నాయని స్థానికులు చర్చించుకోవడం గమనార్హం.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎం.కన్వెన్షన్ హాల్లో ఈ నెల 11న ప్రదర్శించనున్న 'బుద్దునితో నా ప్రయాణం' అనే నాటికకు సంబంధించిన పోస్టర్లను అభ్యాదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆవిష్కరించారు.

మందమర్రిరూరల్: కేకే-5 గనిపై కార్మిక సంఘాల నాయకులు



జన్నారం: ర్యాలీ తీస్తున్న సీఐటీయూ నాయకులు



చెన్నూర్: ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు



సార్వత్రిక సమ్మె సంపూర్ణం

బెల్లంపల్లి/జన్నారం/నెన్నెల/కాసిపేట/తాండూర్/చెన్నూర్/భీమారం/మందమర్రిరూరల్: దేశ వ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మె బుధవారం జిల్లాలో సంపూర్ణంగా విజయవంతమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బీఎంఎస్ మినహా మిగితా జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునివ్వగా, ప్రాంతీయ కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించి సమ్మె ప్రచారం చేశాయి. బొగ్గు గనులు, విభాగాల్లో విస్తృత ప్రచారం సాగించి సమ్మె ప్రాధాన్యతను కార్మికులకు వివరించి అవగాహన కల్పించడంతో కార్మికులు ఏకపక్షంగా సమ్మెకు జై కొట్టారు. బీజేపీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసుకోవాలని, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనాన్ని అమలు చేసి హక్కులు కల్పించాలని పేర్కొన్నారు.

- బెల్లంపల్లిలోని మందమర్రి ఏరియా శాంతిఖని కార్మికులు సమ్మెలో సంపూర్ణంగా పాల్గొని విజయవంతం చేశారు. అత్యవసర కార్మికులు తప్పా, మిగితా కార్మికులు ఇళ్లకు పరిమితమయ్యారు. గని పరిసర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజుగోపాల్, మండల కన్వీనర్ దేవదాస్, అంగన్‌వాడీ, పోస్టల్, రైల్వే, ఆశ, మున్సిపల్, ఐకేపీ విభాగాల శ్రేణులు, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.
- మందమర్రిలో ఏరియాలోని సింగరేణి కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేశారు. సమ్మెలో అత్యవసర సిబ్బంది విధులకు హాజరయ్యారు.
- జన్నారంలో సీఐటీయూ, సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి బుచ్చయ్య, నాయకులు లింగన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.
- చెన్నూర్‌లో సీఐటీయూ జిల్లా నాయకులు సంకె రవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వ్యవసాయ, ఆదివాసీ సంఘాల నాయకులు పెద్ద చెరువు కట్ట నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.
- భీమారంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్నభోజన కార్మికులు రోడ్డుపై ఆందోళన చేశారు.
- నెన్నెలలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ పాఠశాలలు, వ్యాపార సముదాయాలు నాయకులు మూసివేయించారు.
- సీఐటీయూ ఆధ్వర్యంలో తాండూర్ మండల కేంద్రంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు లీలారాణి, సత్యవతి, విజయలక్ష్మీ, తిరుమలేశ్వరి, సుజాత, ప్రేమల, శారద, రాజేశం తదితరులు పాల్గొన్నారు.
- మందమర్రి ఏరియా కాసిపేట 1, 2 గనులపై కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. జేఏసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. అనంతరం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కాసిపేట 1గని నుంచి సోమగూడెం వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్‌దాస్, టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బెల్లం అశోక్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: అంబేద్కర్ చౌరస్తా వద్ద నినాదాలు చేస్తున్న అసంఘటిత కార్మికులు

విద్యుత్ ఉద్యోగుల నిరసన

మంచిర్యాలఅగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ సంస్థలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ శాఖ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సత్తిరెడ్డి, నాయకులు రమేష్, విలాస్, రాజశేఖర్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఉత్తమ్ జాడే, డిఈలు, ఏడిఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన



భీమారం: జాతీయరహదారిపై ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



నెన్నెల: దుకాణాలు మూయిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు



కాసిపేట: గనిపై నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు



తాండూర్: రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు



కాసిపేట: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

'ప్రాణహిత'కు

వరద ఉధృతి

- ఆందోళనలో లోతట్టు ప్రాంతాల రైతులు



పుష్కరఘాట్ రోడ్డుపైకి వచ్చిన వరద నీరు

వేమనపల్లి: ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర–ఛత్తీష్‌గడ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది వరద నీటితో పోటెత్తుతోంది. ఉపనదులైన పెనుగంగా, వార్దానది, వైన్ గంగాలపై ఉన్న పలు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో ప్రాణహితలోకి గంటగంటకు వరద ఎక్కువ అవుతోంది. వేమనపల్లి ప్రాణహిత పుష్కరఘాట్ మెట్లు పూర్తిగా మునిగిపోయాయి. పుష్కరఘాట్ రోడ్లు ముల్కలపేట బొందచేను ఒర్రె, సుంపుటం అట్టలొర్రె వరకు వరద నీరు ప్రవహిస్తోంది. మండలంలోని వేమనపల్లి, కల్మలపేట, కేతన్‌పల్లి, రాచర్ల, జాజులపేట, సుంపుటం, ముక్కిడిగూడం, కళ్లంపల్లి లోతట్టు ప్రాంతాల్లోని పత్తి పంటల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. పెద్ద ఎత్తున పంటలు మునిగే అవకాశం ఉంది. పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

పాఠశాలలు తనిఖీ



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో యాదయ్య

నెన్నెల: మండలంలోని కస్తూరిబా గొల్లపల్లి, మైలారం పాఠశాలలను బుధవారం జిల్లా విద్యాధికారి యాదయ్య తనిఖీ చేశారు. మైలారం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బేస్‌లైన్ పరీక్షలకు సంబంధించిన రికార్డులను, ఉపాధ్యాయుల బోధన విధానాలతో పాటు విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. గొల్లపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉన్నత పాఠశాలలో మెరుగైన బోధనను అందించాలని ఆదేశించారు. ఏకరూప దుస్తువులు, పాఠ్యపుస్తకాల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. బాగా చదివే పిల్లలను వెనుకబడిన పిల్లలతో కలిపి గ్రూపులుగా విభజించి చదివించాలని సూచించారు. రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత ఉన్నారు.

డబుల్ కష్టాలు

- కనీస సౌకర్యాలు లేక లబ్ధిదారుల అవస్థలు
- వీధి దీపాలు, రోడ్లు, తాగునీరు కరువు
- పట్టించుకోని అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని దొరలబంగ్లాస్ ఏరియా రామకృష్ణాపూర్ వెళ్లే కోల్‌బెల్ట్ రహదారి పక్కన ప్రభుత్వం పేదలకు నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు కనీస సౌకర్యాలు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. 560ఇళ్లు నిర్మించగా, నాలుగు నెలల క్రితం లాటరీ ద్వారా 243మంది లబ్ధిదారులకు కేటాయించారు. ఆ కాలనీలో రోడ్లు, సైడ్ కాలువలు, వీధి దీపాలు, వర్షం కురిస్తే స్లాబ్ ఉరవడం, గోడలు పదును రావడం, పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగుల సంచారం, తాగునీటి సరఫరా కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమీపంలోని వాటర్ ప్లాంట్ నుంచి నీరు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని, దీంతో ఆర్థిక భారం తప్పడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కనీస అవసరాలు సమకూర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



మందమర్రిలోని డబుల్ బెడ్ రూం ఇళ్లు

సౌకర్యాలు కల్పించాలి..



డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో తాగునీటి సరఫరా లేక కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. వీధి దీపాలు, సైడ్ కాలువలు లేవు. పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులు, దోమలు విపరీతంగా ఉన్నాయి. వర్షం పడితే స్లాబ్ ఉరుస్తుంది. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలి. – రాజేశ్వరి, లబ్ధిదారు

త్వరలో మిషన్ భగీరథ నీరు అందిస్తాం

కాలనీకి మిషన్ భగీరథ నీరు అందించడానికి పైప్‌లైన్, నల్లాలు ఎస్టిమేషన్ వేసి టెండర్ పిలిచాం. త్వరలోనే పైప్‌లైన్ వేసి తాగునీరు అందిస్తాం. పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేస్తాం. రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు, మిగిలిన సమస్యల కోసం మంత్రి వివేక్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

– రాజలింగు, మున్సిపల్ కమిషనర్

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- జిల్లా వ్యవసాయ అధికారి కల్పన

భీమారం: పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేకాధికారి కల్పన ప్రజలను కోరారు. మండల కేంద్రంలో బుధవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతరించిపోతున్న అడవులను తిరిగి పెంచేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మధుసూదన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



భీమారం: మొక్కనాటి నీళ్లు పోస్తున్న డీఏవో కల్పన

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేసి ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని 34వార్డుల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇళ్లపట్టాలు అందజేసి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శి అరవింద్, బీజేపీ శ్రేణులు ఎం.శ్రీనివాస్, రాజయ్య, స్వామి, రాములు, నర్సింగ్, సంతోష్ అగర్వాల్, శ్రీనివాస్, ప్రశాంత్, ఓంసాయి, కళావతి, రాము తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం ఇస్తూ...

జర్నలిస్టులకు ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇంటి స్థలాలను కేటాయించి, ఇందిరమ్మ పథకంలో ఇళ్లను మంజూరు చేయాలని కోరుతూ బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్కింగ్ జర్నలిస్టులు ఇంటి స్థలం కొనలేని పరిస్థితుల్లో, అద్దె ఇళ్లల్లో జీవనం సాగిస్తున్నారని, సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ఇంటి స్థలంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, కార్యదర్శి గడ్డం సత్యాగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కామెర వెంకటస్వామి, జే.సతీశ్, కోశాధికారి సబ్బని భాస్కర్, జాయింట్ సెక్రటరీ సుమన్, సురేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లేఅవుట్ అనుమతులపై డీపీవో సమీక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో లే అవుట్, గృహ నిర్మాణ అనుమతులు, మ్యుటేషన్, ట్రేడ్ లైసెన్స్‌ల జారీపై డీపీవో వెంకటేశ్వర్‌రావు సమీక్షించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవోలు, ఎంపీఓలతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని సూచించారు. పంచాయతీ రికార్డులు, రిజిష్టర్లు పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

లబ్ధిదారులకు ఇంటి నంబర్ల కేటాయింపు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎంపికైన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం లాటరీ పద్ధతి ద్వారా ఇంటి నంబర్లు కేటాయించారు. దివ్యాంగులకు కింది ఇండ్లను కేటాయించి, మిగిలిన లబ్ధిదారులకు లాటరీ ద్వారా ఇంటిని కేటాయించారు. మొత్తం 230మంది లబ్ధిదారులకు ఇంటి నంబర్లు కేటాయించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, మందమర్రి తహసీల్దార్ సతీశ్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలపై మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు

రామకృష్ణాపూర్: నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు బుధవారం మెడికల్ కౌన్సిల్ తెలంగాణ చైర్మన్ ఎగ్గెన శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సిన ఆర్‌ఎంపీలు ఇష్టారీతిన ఇంజక్షన్‌లు ఇస్తూ ప్రాణాలు తీస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు నిలువరించాలి

మందమర్రిరూరల్: ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులను నిలువరించాలని కోరుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీలు బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మైనింగ్, కార్మిక ఉపాధి కల్పనాశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందించారు.

'పాఠశాలలను బ్లాక్‌మెయిల్ చేసిన వారెవరో తేల్చాలి'

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలను బ్లాక్‌మెయిల్, బెదిరింపులకు పాల్పడుతున్న విద్యార్థి సంఘాలు, నాయకులు ఎవరో వెంటనే వెల్లడించాలని వామపక్ష విద్యార్థిసంఘాలు డిమాండ్ చేశారు. మార్క్స్ భవన్‌లో బుధవారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ, యూఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. ట్రస్మా పేర్కొన్నట్లు నకిలీ విద్యార్థిసంఘాలు ఏంటో పేరుతో సహా తేల్చాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్ పాల్గొన్నారు.

సీవోఈ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

బెల్లంపల్లి: స్థానిక సీవోఈ కళాశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మాత్రలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు జిల్లాల మహేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆకిడి విజయ్‌సాగర్, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యం ఎంచుకోవాలి

మంచిర్యాలక్రైం: మహిళలు విద్యార్థి దశలోనే లక్ష్యాలు ఎంచుకోవాలని స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం షీ టీమ్, భరోసా, సఖీ సెంటర్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీమ్ ఎస్సై హైమ, షీ టీమ్, భరోసా, సఖి సెంటర్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్ ఎంఈవోగా పద్మజ

నస్పూర్: నస్పూర్ ఎంఈవోగా సీతారాంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం పద్మజ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న దామోదర్ వ్యక్తిగత కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

నెన్నెల తహసీల్దార్‌గా జ్యోతి

నెన్నెల: నెన్నెల మండల తహసీల్దార్‌గా ముద్దమల్ల జ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నెన్నెల తహసీల్దార్‌గా పనిచేసిన మహేంద్రనాథ్ నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. డీటీ ప్రకాష్, ఆర్ఐ సులోచన, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

నియామకం

మంచిర్యాలఅర్బన్: జిల్లా జెండర్ అండర్ ఈక్విటీ కో–ఆర్డినేటర్‌గా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. దండేపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్గనూర్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న విజయలక్ష్మి నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా విద్యాశాఖా కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ లలిత, సూపరింటెండెంట్లు సత్యనారాయణ, అజయ్‌కుమార్, సమగ్రశిక్షణ కో–ఆర్డినేటర్లు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ దామోదర్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది విజయలక్ష్మిని సన్మానించారు.

గోరింటాకు సందడి

శ్రీరాంపూర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో గోరింటాకు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసంను పురస్కరించుకొని జరిగిన ఈ కార్యక్రమానికి ఏరియా సేవా అధ్యక్షురాలు ఉమారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.